క్లుప్తంగా

ఆయుర్వేద వైద్య ఉచిత శిబిరం



గుంటూరు రూరల్: ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు త్వరితగతిన నయమవుతాయని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నగర శివారులోని ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతనమైన వైద్యంలో ఆయుర్వేద వైద్యం ప్రఖ్యాతిగాంచిందన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వైద్యం అందజేస్తున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 100 పడకలతో ఆయుర్వేద వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి, అర్హులకు రూ.60 వేలు విలువైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి


చేబ్రోలు: పేదల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన ఆదర్శనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ అన్నారు. చేబ్రోలులో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య, స్థానిక సీనియర్ కమ్యూనిస్ట్ నేత పోలిశెట్టి కోటేశ్వరరావు వర్ధంతి సభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇద్దరి చిత్ర పటాలకు సీపీఎం నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుందరయ్య తన యావదాస్తిని పేద ప్రజలకు పంచిన యోధుడు అన్నారు. చేబ్రోలుకు చెందిన కమ్యూనిస్టు నేత పోలిశెట్టి కోటేశ్వరరావు పేద ప్రజల సమస్యల కోసం స్థానికంగా పోరాటాలు చేశారన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. సీపీఎం నాయకులు సీహెచ్ హనుమంతరావు, చౌదయ్య, రాజు, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్



చేబ్రోలు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత ప్రజలు గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలని చేబ్రోలు ఎస్‌ఐ పి.మహేష్ కుమార్ అన్నారు. మండలంలోని వేజండ్ల, నారాకోడూరు తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ పి.మహేష్ కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున, తర్వాత ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతవరణం కొనసాగించాలని సూచించారు. మండల పరిధిలోని మంచాల, చేబ్రోలు, నారాకోడూరు, వేజండ్ల, వడ్లమూడి, గ్రామాల పరిధిలోని పెట్రోలు బంకు యజమానులకు డబ్బాలు, బాటిల్స్, విడిగా ఇతర వస్తువులలో పెట్రోలును నింపి విక్రయాలు చేయవద్దని ఆదేశించారు. బంకు యజమానులకు నోటీసులు అందజేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు కేవలం వాహనదారులకు మాత్రమే పెట్రోలు, డీజిల్‌ను నింపాలని సూచించారు. ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్‌ఐ పి.మహేష్ కుమార్ హెచ్చరించారు.

పొంగుతున్న నిర్లక్ష్యం



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు మ్యాన్‌హోల్ నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పలు ప్రధాన కూడళ్లలో, కమర్షియల్ ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా రోడ్డుపై పెద్ద ఎత్తున్న మురుగు పారడంతో చుట్టుపక్కల వారికి, వాహనదారులు దుర్వాసన వెదజల్లుతుంది. అధికారులు స్పందించి నగరంలో ఉన్న మ్యాన్‌హోల్స్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు.

కార్మెల్ మాతను దర్శించుకున్న భక్తులు



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు పలుప్రాంతాలనుంచి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పొద్దుటూరు, దర్శి, ధర్మవరం, కర్నూలు, మార్కాపురం ప్రాంతాలను పలు వాహనాలు, రైళ్లలో తరలి వచ్చారు. కొండ ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్‌మాత మందిరంలో కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

రైతుల ఖాతాల్లోకి పరిహారం

- మిచాంగ్ తుపాను నష్టపరిహారం చెల్లింపు
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో 21 వేల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం
- పంట నష్ట పరిహారాన్ని విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- నేరుగా రూ. 11.32 కోట్లు రైతుల ఖాతాలకు జమ
- 12,147 మంది రైతులకు ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



మిచాంగ్ తుపాను ప్రభావంతో ప్రత్తిపాడు మండలంలో నీట నానుతున్న మిర్చి పంట (ఫైల్)

ప్రత్తిపాడు: గత టీడీపీ ప్రభుత్వంలో పంట నష్ట పరిహారం అందాలంటే సంవత్సరాలు దాటిపోయేవి. పంట నష్టం అంచనాలు రూపొందించడమే గానీ, సకాలంలో పరిహారం చెల్లించిన దాఖలాలు వేళ్లపైన లెక్కపెట్టవచ్చు. పరిహారాన్ని పూర్తిగా పరిహాసం చేశారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పంట నష్టం అదే సీజనులో రైతులకు అందుతుంది. అంచనాలు రూపొందించడం మొదలు, పరిహారం చెల్లింపు వరకు అన్నీ ఒక క్రమ పద్ధతిలో జరిగిపోతున్నాయి. పంట నష్టపోయిన సీజన్‌లోనే పరిహారం చెల్లిస్తూ రైతులకు బాసటగా నిలుస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పంట నష్ట పరిహారం నగదును విడుదల చేయడంతో అవి నేరుగా రైతుల ఖాతాల్లోనికి జమ అవుతున్నాయి.

మిచాంగ్ తుపానుతో పంటనష్టం..

గతేడాది డిసెంబరులో మిచాంగ్ తుపాను ప్రభావంతో పంటలు నియోజకవర్గంలో వేల ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు యంత్రాంగం హుటాహుటిన పంట పొలాలకు వెళ్లి పంట నష్ట పరిహారం అంచనాలను రూపొందించింది. మొత్తం 21 వేల ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నట్లు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఈ నేపథ్యంలో శనివారం నుంచి రైతుల ఖాతాల్లోనికి నష్ట పరిహారం నగదు జమ అవుతోంది. దీంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో పరిహారం లెక్క ఇలా..

- పంట నష్టపోయిన రైతులు: 12,147
- దెబ్బతిన్న పంట విస్తీర్ణం: 21,236.02 ఎకరాలు
- పరిహారం నగదు: రూ. 11,32,31,411లు

మండలాల పరిహారం వివరాలు ఇలా..

- ప్రత్తిపాడు మండలంలో 2,271 మందికి రైతులకు సంబంధించిన 3,691.15 ఎకరాల్లో మిర్చి పంట దెబ్బతింది. ఇందుకు సంబంధించి హెక్టారుకు రూ.17 వేల చొప్పున ప్రభుత్వం రూ.2,50,99,820ల పరిహారాన్ని రైతుల ఖాతాలకు జమజేస్తోంది.
- పెదనందిపాడు మండలంలో 1,925 మంది రైతులకు చెందిన 3,337 ఎకరాల్లో మిర్చి పంట దెబ్బతింది. పరిహారం కింద రూ.2,26,95,000లు పరిహారం ఖాతాలకు జమవుతోంది.
- కాకుమాను మండలంలో 7,346.30 ఎకరాల్లో 3,803 మంది రైతులకు చెందిన వరి పంట దెబ్బతినగా, రూ.4,99,54,874లు అన్నదాతలకు పరిహారంగా చెల్లిస్తున్నారు. అదేవిధంగా పదిహేను ఎకరాల్లో సాగు చేసిన మినప పైరు కూడా దెబ్బతినడంతో హెక్టారుకు రూ.10వేలు చొప్పున రూ.60 వేలు జమకానున్నాయి.
- గుంటూరు రూరల్ మండలంలో 879.365 ఎకరాల్లో దెబ్బతిన్న వరి, మినుము, పొగాకు పంటలకు సంబంధించి 368 మంది రైతుల ఖాతాలకు రూ.49,01,587లు జమవుతున్నాయి.
- వట్టిచెరుకూరు మండలంలో 3,775 మంది రైతులకు చెందిన 5,965 ఎకరాల్లో మిర్చి పంట దెబ్బతినగా పరిహారం కింద రూ.4,05,80,130 పరిహారం ఖాతాలకు జమకానున్నాయి.

పెట్టుబడులకు సాయంగా..

వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రుతు పవనాలు ఈ ఏడాది ముందుగానే రానున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ సకాలంలోనే ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రైతులు పెట్టుబడులకు దిక్కులు చూసే పనిలేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల ఖాతాలకు నష్టపరిహారాన్ని జమ చేసేస్తున్నారు. వాస్తవానికి ఈ నగదు ఎప్పుడో రైతుల ఖాతాల్లోనికి జమ కావలసి ఉన్నప్పటికీ, ఎన్నికల కోడ్ సాకుతో టీడీపీ కుటిల రాజకీయం పన్ని నిధుల విడుదలకు మోకాలడ్డింది. దీంతో విడుదలలో జాప్యం చోటుచేసుకుంది.

శాంతిభద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్



కవాతులో పాల్గొన్న సౌత్ డీఎస్పీ మహబూబ్ బాషా, సీఐ నరేష్‌కుమార్

గుంటూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయ్యి.. కౌంటింగ్ దగ్గరపడుతున్న సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా.. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆదివారం స్వర్ణభారతి నగర్‌లో నిర్వహించిన కవాతుకు సౌత్ డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, శాంతి భద్రతలను కాపాడే క్రమంలో కవాతు నిర్వహించటం జరిగిందన్నారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగాయని, అదేవిధంగా వచ్చే నెలలో జరిగే కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజా సంరక్షణ పోలీస్ బాధ్యతగా చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ జీవించాలని సూచించారు. కాలనీలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవం



తక్కెళ్ళపాడు గ్రామంలో కోలాహలంగా శ్రీ చౌడేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో చౌడేశ్వరి అమ్మవారు

పెదకాకాని: శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏటా జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది 16 జ్యోతులతో శనివారం రాత్రి 12 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకూ గ్రామోత్సవం జరిగింది. ఈ అమ్మవారి జ్యోతుల ప్రదర్శన మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన ఆడపడుచులు, బంధుమిత్రులు స్వగ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పొంగలి నైవేధ్యాలు సమర్పించారు. మంగళ వాయిద్యాలతో తొగట వీరులు కత్తులు, నారజములు, పసుపు కొమ్ములతో జలది దగ్గరకు వెళ్లి బండారు కొట్టుట జరిగింది. రాత్రి 10 గంటలకు జ్యోతుల తయారు చేసి మేళ తాళాలు, భజనలు, తీన్‌మార్ తప్పెట్ల నడుమ గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. రాత్రంతా జ్యోతుల ప్రదర్శనతో వైభవంగా జరిగింది. గ్రామోత్సవాన్ని ప్రజలు ఆహ్వానించి శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి స్వాగతం పలికారు. రాత్రంతా జ్యోతుల జాతర చోటు చేసుకుంది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులందరికీ అన్న సంతర్పణ చేశారు.

వివాదాలకు దూరంగా ఉండాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ రవీంద్ర

కాకుమాను: ప్రస్తుతం గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వివాదాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ ఎస్.రవీంద్ర అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మండలంలోని రౌడీ షీటర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీట్ ఉన్న ప్రతి ఒక్కరూ వివాదాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. షీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రతి రోజు కట్టుదిట్టమైన నిఘా పెట్టినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే కొంత కాలనికి షీటు తీసే అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ దీనిని గమనించి మసులుకోవాలని స్పష్టం చేశారు.

గంజాయి మత్తు..యువత చిత్తు



భ్రమరాంబపురం కాలనీలో గంజాయిని పీల్చి వదిలిన ప్లాస్టిక్ బాటిళ్లు



గంజాయి బాబులకు అడ్డాగా మారిన నిర్మానుష ప్రదేశాలు

అంధకారం భవిష్యత్తు

పెదకాకాని: గంజాయి మత్తులో యువత జీవితాలు చిత్తు అవుతోంది. మత్తుకు బానిసలుగా మారి భవిష్యత్తు అంధకారం చేసుకుంటున్నారు. డిగ్రీలు చదివి జీవితానికి బంగారు బాటలు వేసుకోవాల్సిన.. భావితరం వెర్రి తలలు వేసి మత్తులో జోగుతోంది. పుస్తకాల బ్యాగులతో కళాశాలలకు వెళ్తున్న వారిలో పలువురు యువకులు తరగతులకు డుమ్మా కొట్టి నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి గుప్పుమనిపిస్తున్నారు. ఈ గంజాయి ఒక్కో ప్రాంతంలో షార్ట్ కట్‌లో ఒక్కో పేరుతో పిలుస్తూ పక్క వారికి తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. ముఖ్యంగా నంబూరు వీవీఐటీ కళాశాల రోడ్డు, పెదకాకాని భ్రమరాంబపురం, రైల్వే ట్రాక్, గోరంట్ల పొలిమేర వంటి ముళ్ళ పొదలు, నిర్మానుష్య ప్రాంతాలకు చేరుతున్నారు. నలుగురు యువకులు ఒక చోటకు చేరడం సిగరెట్‌లో గంజాయి నింపి గుప్పుమనిపిస్తుంటే.. మరికొందరు లిక్విడ్ రూపంలో ఉన్న మత్తు పదార్థాన్ని ప్లాస్టిక్ షోడా బాటిళ్లలో నింపి దానికి ఏర్పాటు చేసిన రంధ్రం గుండా పీల్చడానికి గొట్టం మాదిరిగా ఏర్పాటు చేసుకుని ఆస్వాదిస్తున్నారు. ఈ మత్తులో తూగుతున్న యువత పలు సందర్భాల్లో విచక్షణ కోల్పోయి పలు ఘర్షణలకు కారణమవుతున్నారు. ప్రజలను కూడా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ మత్తు పదార్థాల విక్రయాలు పెదకాకాని మండలంలోని పెదకాకాని, ఉప్పలపాడు, నంబూరు గ్రామాల్లో విక్రయిస్తూ పలువురు సొమ్ము చేసుకుంటున్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. ఈ గంజాయి మత్తు పదార్థాల కారణంగా ఎంతో ఘనంగా జరిపించిన పెళ్ళిళ్ళు కూడా మూన్నాళ్ల ముచ్చటగా ముక్కలవుతున్నాయి. అదుపు చేయాల్సిన పోలీసు సిబ్బంది బిజీగా ఉంటున్నారు. గంజాయి కేసులు కూడా మొక్కుబడిగానే నమోదు అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గంజాయి సరఫరా చేస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రులు, మండల ప్రజలు కోరుతున్నారు.

గ్యాస్ట్రిక్ సమస్యను నిర్లక్ష్యం చేయరాదు

గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్దార్థ రెడ్డి



మాట్లాడుతున్న ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్దార్థ రెడ్డి, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: కాలేయ, జీర్ణకోశ వ్యాధులకు ప్రస్తుతం అత్యాధునిక వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందని, గ్యాస్ సమస్య నివారణ మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని తెలుసుకోవాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్దార్థ రెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి ఆధ్వర్యంలో లివర్, జీర్ణకోశ వ్యాధులపై జరిగిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ఎక్కువమంది ఎదుర్కొంటున్న గ్యాస్ట్రిక్ సమస్య ప్రమాదకరమైంది కాదన్నారు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాలు మీదకు వచ్చేంత గందరగోళానికి గురిచేస్తుందన్నారు. అన్నవాహిక, పొట్ట, చిన్నప్రేగులు, పెద్దప్రేగులు జీర్ణప్రక్రియలో ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. అన్నవాహికకు జీఈఆర్‌డీ సమస్య, కార్సినోమా సమస్య ఉత్పన్నమవుతాయని, ఈ సమస్యతో బాధపడేవారు పులుపు కలిగిన పండ్లను, చాక్లెట్లను, టమాట, వెల్లుల్లి, ఉల్లి, వేయించిన వస్తువులు, కూల్‌డ్రింక్స్, ఫ్యాటీ ఫుడ్స్, ఆల్కహాల్ వంటి వాటిని దూరం పెట్టాలన్నారు. తిన్న వెంటనే పడుకోరాదని, తక్కువ ఆహారం ఎక్కువసార్లు తీసుకుంటే మంచిదన్నారు. బరువును అదుపులో ఉంచుకోవాలని, పొట్టలో యాసిడ్స్ ఎక్కువగా ఉత్పన్నమైతే స్టమక్ అల్సర్, స్టమక్ క్యాన్సర్‌కి దారితీస్తుందన్నారు. అనంతరం అవగాహన సంస్థ సభ్యులు డాక్టర్ సిద్ధార్థ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి టీవీ సాయిరాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంస్థ సీనియర్ సభ్యులు ఆర్.రామచంద్రరావు, శివ శంకర్‌రావు పాల్గొన్నారు.

ప్రమాద కూడళ్లు





ప్రమాదకరంగా ఉన్న పచ్చలతాడిపర్రు ప్రధాన రహదారి

- పచ్చల తాడిపర్రు రహదారిలో ప్రమాదాలు
- రోడ్డు దాటుతూ.. మలుపు తిరుగుతూ..
- వాహన వేగ నియంత్రణలో విఫలం

పొన్నూరు: మండలంలోని పచ్చల తాడిపర్రు ప్రధాన రహదారి ప్రమాదాలకు కేంద్రంగా మారింది. గుంటూరు, చీరాల, బాపట్ల, రేపల్లెకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే గ్రామ కూడళ్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు చేపడుతున్న రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. పొన్నూరుకు వెళ్లే మలుపునతో పాటు గుంటూరు వైపు వెళ్లే మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామ ప్రధాన రహదారిలోని మలుపులు అతి ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు భయం గుప్పిట్లో ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. డ్రైవర్ల అవగాహన రాహిత్యం, నిబంధనలు పాటించకపోవడం, అతివేగం వంటి కారణాలతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రమాదాల సమయంలో హడావుడి చేస్తున్న పోలీసులు అనంతరం శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారు. గ్రామ సెంటర్ కావడంతో హోటళ్లకు వెళ్లేందుకు ప్రజలు రోడ్డు దాటుతున్న సమయంలో వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



గ్రామ ప్రధాన రహదారిలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రజలు రోడ్డు దాటాలంటే భయాందోళన చెందుతున్నారు. వాహనాలు అతివేగంగా వెళుతుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలను నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి.

– యర్రగుంట శ్రీనివాసరావు, పచ్చల తాడిపర్రు

ప్రమాదాలకు కేంద్రం



పచ్చల తాడిపర్రు గ్రామ ప్రధాన రహదారి ప్రమాదాలకు కేంద్రంగా మారింది. మలుపుల వద్ద కూడా వాహనాలు అతి వేగంగా వస్తున్నాయి. ప్రమాదాలు జరిగినపుడు అధికారులు పలు సూచనలు చేస్తున్నారు కానీ శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వాహన వేగాన్ని నియంత్రించే దిశగా చర్యలు చేపట్టాలి.

– వెంకట పూర్ణచంద్రరావు, పచ్చల తాడిపర్రు

బాణసంచా షాపులకు నోటీసులు అందజేత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలో వున్న బాణసంచా షాపులకు ఆదివారం తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజ్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నోటీసులు అందజేస్తున్నామని, జూన్ 4వ తేదీ వెలువడే పార్లమెంట్, అసెంబ్లీ ఫలితాలు రానున్నాయని, ఆ సందర్భంగా బాణసంచా పెద్ద మొత్తంలో అమ్మకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, దానిలో భాగంగా ఉండవల్లిలో వున్న హోల్‌సేల్ బాణసంచా దుకాణాలకు ఈ నోటీసులు అందజేశామని, జూన్ 4వ తేదీ పోలీసుల అనుమతి లేకుండా ఎవరూ ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించకూడదని, పెట్రోల్ బంకుల వారు పెట్రోల్,డీ జిల్‌ను క్యానుల్లో, బాటిళ్లలో అమ్మకూడదని ఆయన సూచించారు.

వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు




కొబ్బరి కాయలు కొడుతున్న దృశ్యం

నగరంపాలెం: వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించాలని, వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ రెడ్డి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కంజుల సత్యనారాయణరెడ్డి నిర్విరామ ప్రత్యేక పూజలకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆదివారం మొదలైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సత్యనారాయణరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయుక్తంగా 10 లక్షల పారిజాత పుష్పాలతో తొలుత స్వామివారికి విశిష్ట అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం 101 కొబ్బరికాయలు కొట్టి స్వామి వారిని స్మరించుకున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల నామధేయాలు ఉచ్చరిస్తూ, వారిని తిరుగులేని ఆధిక్యంతో గెలిపించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా కంజుల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని అన్నారు. పేదరిక నిర్మూలన జరిగి నవ సమాజ నిర్మాణం జరిగేందుకు వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అఖండ విజయాన్ని కోరుకుంటూ పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీన్ని ఒక నిరంతరం ప్రక్రియగా కొనసాగిస్తామని వెల్లడించారు. టి.వెంకటేశ్వరరెడ్డి, బలరామిరెడ్డి, కంజుల సూర్యకుమారి, విజయలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

ఫలితాల రోజు వివాదాలకు పాల్పడితే సహించేది లేదు

ప్రత్తిపాడు నోడల్ ఆఫీసర్ నిసార్ బాషా



ప్రత్తిపాడు: ఎన్నికల ఫలితాల రోజు సంయమనం పాటించాలని, వివాదాలకు పాల్పడితే సహించేది లేదని ప్రత్తిపాడు సీఐ, నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ ఎండీ నిసార్ బాషా అన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పోలీసుశాఖ అప్రమత్తం అయ్యింది. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించింది. అందులో భాగంగా ప్రత్తిపాడు మండల పరిధిలోని రావిపాటివారిపాలెంలో ఆదివారం రాత్రి ఎస్‌ఐ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన సీఐ నిసార్ బాషా మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా వచ్చినప్పటికీ ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. రెచ్చగొట్టడం, రెచ్చిపోవడం వంటి కవ్వింపు చర్యలకు ఏ ఒక్కరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఒక్కసారి ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం వెంటాడుతాయని తెలిపారు.